రాహుల్‌ను పిచ్చోడిని చేస్తున్న రేవంత్

ఆయనే మో గుజరాత్ మాడల్ ఫేక్ అంటే..

ఈయనే మో ఆ మాడలే గొప్పదని అంటడు

మోదీ చౌకీదార్ అని ఆయన.. బడేభాయ్ అని ఈయన

హామీలు నెరవేర్చకపోతే వెంటాడుతం: కేటీఆర్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

మేడ్చల్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాహుల్‌గాంధీని సీఎం రేవంత్‌రెడ్డి పిచ్చోడిని చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 'రాహుల్ ఏమో మోదీని చౌకీదార్ చోర్ అంటే.. రేవంతేమో బడే భాయ్ అని అంటున్నారు. అదానీ ఫ్రాడ్ అని ఆయన అంటే.. హమారా ఫ్రెండ్ అని ఈయన చెప్పుకుంటున్నారు. ఆయనేమో గుజరాత్ మాడల్ ఫేక్ అని అంటే.. ఈయనేమో తెలంగాణను గుజరాత్ మాడల్ చేస్తానని అంటున్నడు' అని ఎద్దేవా చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో జరిగిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. కాంగ్రెస్ సర్కారును కూల్చే అవసరం తమకు లేదని, ఇచ్చిన హామీలను అమలు చెయ్యకపోతే వెంటాడి, వేటాడుతామని హెచ్చరించారు. రైతులకు చేస్తామన్న రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతు భరోసా ఏమైందని కాంగ్రెస్ సర్కారును ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీజేపీలో చేరే తొలి వ్యక్తి రేవంత్‌రెడ్డేనని ఆరోపించారు. మోదీ ఏం చేస్తాడోనన్న భయానికి ముందే బీజేపీలో చేరేందుకు ప్లాన్ చేసుకుంటున్నారని విమర్శించారు.

8 ప్రభుత్వాలను కూలదోసిన బీజేపీ

'అయితే జేబులో ఉండాలె.. లేదంటే జైల్లో ఉండాలన్నాదే ప్రధాని మోదీ సిద్ధాంతం. 10 ఏండ్లలో బీజేపీ 8 రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసింది. రాముడి పేరు చెప్పుకొని రాజకీయం చేసే బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలి. భద్రాద్రి రాముడు, ఘట్కేసర్ రాముడి దేవాలయాలకు రూపాయి కూడా ఇవ్వని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఓటు వేద్దామా?' అని అన్నారు. తాము యాదగిరిగుట్ట ఆలయాన్ని పునర్నిర్మించినా, ఏనాడైనా రాజకీయాలకు వాడుకున్నామా? అని అడిగారు. సమావేశంలో ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కాటుకు మరో రైతు బలి

- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి కోస్తుండగా కరెంట్ షాక్
- కరీంనగర్ జిల్లా రాంపూర్‌లో విషాదం

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 10: ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డికోస్తున్న రైతు కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈ విషాద ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం రాంపూర్‌లో చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు ముద్రబోయిన రాజు (49) మంగళవారం సాయంత్రం తన పొలం గట్టున గడ్డికోస్తూ అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు తగిలి కరెంట్ షాక్‌కు గురై మరణించాడు. చీకటిపడినా రాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించగా బుధవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు టౌన్ సీఐ రమేశ్ తెలిపారు. కాగా రాజుకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

గంగాజమునా తెహజీబ్ కొనసాగాలి

ముస్లింలకు కేసీఆర్ రంజాన్ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): పవిత్ర రంజాన్ మాసం చివరిరోజు 'ఈద్ ఉల్ ఫితర్' పర్వదినం సందర్భంగా ముస్లింలకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలియజేశారు. నెలరోజులపాటు కొనసాగిన రంజాన్ ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు, పేదలకు సంతర్పణ కార్యాలు తెలంగాణ వ్యాప్తంగా గొప్ప ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపాయని పేర్కొన్నారు. అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, నూతన రాష్ట్రాన్ని సర్వమతాల సమాహారంగా, గంగాజమునా తెహజీబ్‌కు ఆలవాలంగా మార్చామని, లౌకికవాద సంప్రదాయాలను పాటిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తమ పదేండ్ల పాలనలో నిలబెట్టామని తెలిపారు. అదే సంప్రదాయం కొనసాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించేలా దీవించాలని దైవాన్ని ప్రార్థించారు.

నిరుద్యోగంపై చర్చ జరగాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్యపై చర్చ జరగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. ఐఐటీ పట్టభద్రులకే ఉద్యోగాలు లభించడం లేదంటే దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న మన దేశంలో ప్రస్తుతం ఉన్న నిరుద్యోగ సమస్య ఎంతో ప్రధానమైనదని పేర్కొన్నారు. ఐఐటీ బాంబేకు చెందిన తాజా బ్యాచ్ విద్యార్థుల్లో 36 శాతం మందికి ఉద్యోగాలు లభించలేదంటూ వచ్చిన వార్తా కథనాన్ని దీనికి ట్యాగ్ చేశారు.

దానంపై హైకోర్టులో బీఆర్ఎస్ పిటిషన్

మొదటిపేజీ తరువాయి...

ఎంపీగా పోటీ చేస్తున్నారని పిటిషన్‌లో తెలిపింది. సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా కూడా దానం పేరును కాంగ్రెస్ ప్రకటించిందని వివరించింది. ఈ విషయంపై మార్చి 18నే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా స్పందించటం లేదని, అందుకే కోర్టును ఆశ్రయించినట్టు వెల్లడించింది. దానం అనర్హతపై త్వరగా చర్యలు తీసుకొనేలా స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రానున్నది.

మతసామరస్యానికి రంజాన్ ప్రతీక: సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రంజాన్ పర్వదినం లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటనలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. గంగాజమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని పేర్కొన్నారు.

జగిత్యాలలో హన్మంతరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, డాక్టర్ సంజయ్‌కుమార్, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు

ఎమ్మెల్యే సంజయ్‌కు కేసీఆర్ పరామర్శ

- 29న సంజయ్‌కు పితృవియోగం
- హన్మంతరావు సేవలు చిరస్మరణీయం: కేసీఆర్

జగిత్యాల, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు బుధవారం పరామర్శించారు. సంజయ్ తండ్రి సీనియర్ న్యాయవాది మాకునూరు హన్మంతరావు గత నెల 29న మృతిచెందారు. జగిత్యాలలో బుధవారం నిర్వహించిన హన్మంతరావు స్వర్గపా త్ర కార్యక్రమానికి హాజరైన కేసీఆర్.. హన్మంతరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జగిత్యాలలో దాదాపు ఆరున్నర దశాబ్దాలకుపైగా న్యాయవాద వృత్తిలో కొనసాగి, న్యాయవాద వృత్తికి హన్మంతరావు చేసిన సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ కొనియాడారు. ఆయన కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించి, ప్రగాఢసానుభూతి తెలియజేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం హన్మంతరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సంజయ్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్, విప్ లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, సుద్దాల దేవయ్య, రాజేశంగౌడ్, ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మేడిపల్లి సత్యం, సత్యనారాయణ, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ భానుప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు పరామర్శించారు.

కుటుంబసభ్యులతో కేసీఆర్‌ను కలిసిన నివేదిత. చిత్రంలో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా నివేదిత

- ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్
- సాయన్న కుటుంబం కృతజ్ఞతలు

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థిగా గైని నివేదితను పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు బుధవారం ప్రకటించారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి, అందరి ఏకాభిప్రాయంతో ఆమె అభ్యర్థిత్వాన్ని ఖరారుచేశారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న మరణాంతరం ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కూతురు లాస్య నందితకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి గెలిపించుకున్నది. లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి పోటీకి కొంతమంది ఆసక్తి చూపినా సాయన్న కుటుంబానికి అండగా నిలబడాలన్న లక్ష్యంతో నివేదితకు టికెట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించింది. తనను అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్‌కు నివేదిత కృతజ్ఞతలు తెలిపారు. ఆమె తన తల్లి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులతో కేసీఆర్‌ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు.

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో ఎండిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

ఎండిన పంటలకు ఎకరాకు 25 వేలు ఇవ్వాలి

- పంటలకు 500 బోనస్ ఇవ్వాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 10: ఎండిన పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, యాసంగి పంటలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. రైతు సంఘాల ఆహ్వానం మేరకు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో ఎండిన వరి పంటలను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను వివరాలు అడిగి తెలుసుకొని వారిని ఓదార్చారు. దేవాదుల డీఈ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి దేవాదుల నార్త్ కెనాల్ ద్వారా నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ఆరా తీశారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్షగట్టి తెచ్చిన కరువని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం మెడలు వంచైనా రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం అమటోనిపల్లి శివారులో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ రాగానే కరువొచ్చింది

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- మహబూబ్‌నగర్ జిల్లా అమటోనిపల్లిలో పంటల పరిశీలన

హన్వాడ, ఏప్రిల్ 10 : భూగర్భ జలాలు అడుగంటి.. బోరుబావులు ఒట్టిపోవడంతో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో కరువొచ్చిందని అన్నారు. బుధవారం ఆయన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం అమటోనిపల్లి శివారులో ఎండిన వరి పంటలను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పంట ఎండిన పొలాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. హన్వాడ మండలంలో 50 శాతం వరకు పంటలు ఎండిపోయాయని చెప్పారు. తెచ్చిన అప్పులు వడ్డీలు పెరిగి ఎలా తీర్చాలో ఆందోళన చెందుతూ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

పెద్దకొత్తపల్లి, ఏప్రిల్ 10 : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడ గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తలపై మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు దాడి చేయడంతో నలుగురికి గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖానకు తరలించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం గ్రామంలో దాయాదుల మధ్య ఉన్న భూ సమస్య నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అనుచరులపై మంత్రి జూపల్లి వర్గీయులు దాడులు చేస్తున్నారని మాజీ సర్పంచ్ ఇందిర భర్త రవినాయక్ తెలిపారు. భూసమస్యపై సంబంధిత అధికారులకు బీఆర్ఎస్ కార్యకర్తలు విన్నవించినా.. జూపల్లి అనుచరులు దాడులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌ను టీఆర్ఎస్‌గా మార్చాలి

కేసీఆర్‌కు పార్టీ నాయకుడి లేఖ

సారంగాపూర్, ఏప్రిల్ 10: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించిన బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం రావాలంటే బీఆర్ఎస్‌ను మళ్లీ టీఆర్ఎస్‌గా మార్చాలని ఆ పార్టీ జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల ఉపాధ్యక్షుడు రామకిష్టు గంగాధర్ కోరారు. ఈ మేరకు బుధవారం జగిత్యాలకు వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఓ లేఖ అందజేశారు.

సూర్యాపేటలో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

కాంగ్రెస్‌కు ప్రజల బాగోగులు పట్టవు

- కేసీఆర్ బయటకు రాగానే కాళేశ్వరం నీళ్లొచ్చినయ్
- సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం

సూర్యాపేట, ఏప్రిల్ 10 (నమస్తేతెలంగాణ): 'మోసాలకు మారుపేరైన కాంగ్రెస్ పార్టీ.. ఎప్పటికీ దుర్మార్గపు ఆలోచనలు చేయడం తప్ప ప్రజల బాగోగులు పట్టించుకోదు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్ అయ్యారు. సూర్యాపేటలో బుధవారం నిర్వహించిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్కారు నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరువు ఏర్పడిందని మండిపడ్డారు. వంద రోజుల తర్వాత కష్టాల్లో ఉన్న రైతుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాలు బయట పెట్టగానే.. పని కిరావన్న కాళేశ్వరం బాహుబలి మోటర్లు ఆన్ అయ్యాయని తెలిపారు. ఆ మోటర్లను నెల రోజుల ముందు ఆన్ చేస్తే లక్షల ఎకరాల్లో పంటలు చేతికి వచ్చేవని చెప్పారు. గతంలో నాగార్జునసాగర్ నీటిమట్టం 508 అడుగుల్లో ఉన్నా కేసీఆర్ చొరవతో నీటిని విడుదల చేసి పంటలను కాపాడితే.. నేడు 513 అడుగులకు పైన నీళ్లున్నా విడుదల చేయడం లేదని గుర్తుచేశారు. ఓ వర్గం మీడియా కూడా కేసీఆర్‌పై విషం చిమ్ముతున్నదని, కాళేశ్వరం మూడు పిల్లర్లు కుంగితే కేసీఆర్ తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇప్పటికీ ప్రాజెక్టు నుంచి నీళ్లు లిఫ్ట్ చేసి కాల్వలకు అందించవచ్చని సూచించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పచ్చి అబద్ధాలతో అధికారంలోకి..

- హస్తం హామీలపై నిలదీయండి
- పదేండ్ల బీఆర్ఎస్ అభివృద్ధి.. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనపై బేరీజు వేయండి
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా. చిత్రంలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

జనగామ, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): పచ్చి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి ప్రజలను ఇంకా మభ్యపెడుతున్న అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వ నిజస్వరూపాన్ని ప్రజల్లో చర్చకు పెట్టి ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గులాబీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జనగామ రూరల్ మండలం శామీర్‌పేట వద్ద జరిగింది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలైన రూ.2 లక్షల రుణమాఫీ, 24 గంటల నాణ్యమైన కరెంటు, రూ.15 వేల రైతు భరోసా, ధాన్యానికి రూ.500 బోనస్, రూ.4 వేల పింఛన్లకు సంబంధించిన అంశాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి ఆ పార్టీ నాయకుల అసలు స్వరూపాన్ని ఎండగట్టాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు.

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం అమటోనిపల్లి శివారులో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నన్ను చంపేందుకు కాంగ్రెస్ కుట్ర

పదవి ముగియగానే గన్‌మెన్లను తొలగించి చంపే పన్నాగం

పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సంచలన ఆరోపణ

మంథని, ఏప్రిల్ 10: 'నన్ను చంపేందుకు కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారు.. పదవీకాలం ముగిసిన వెంటనే గన్‌మెన్లను తొలగించి హతమార్చేందుకు పథకం రూపొందించారు' అని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ సంచలన ఆరోపణలు చేశారు. మంథని ప్రజల ఆశీర్వాదంతో బీసీ సామాజిక వర్గం నుంచి ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా ఎదిగిన తనపై కాంగ్రెస్ నేతలు ఓర్వలేక తప్పుడు ప్రచారం చేసి ప్రజల నుంచి దూరం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 2018, 2023లో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి స్థానికంగా అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ నేతలు, రాబోయే ఎన్నికల్లో వారికి ఎదురు లేకుండా చూసేందుకు తనను భౌతికంగా లేకుండా చేసేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. బుధవారం ఆయన పెద్దపల్లి జిల్లా మంథనిలోని రాజగృహలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలన ఇసుక, మట్టి, బియ్యం మాఫియాకు కేరాఫ్‌గా మారిందని నిప్పులు చెరిగారు. ఎన్నికల ముందు తనపై అడ్డగోలుగా ఆరోపణలు చేసి, అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా ఆధారాలు ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు.

కాంగ్రెస్ హామీలు ఎటుపాయె

- వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధిచెప్పాలి
- జహీరాబాద్‌లో గులాబీ జెండా ఎగరాలి
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

దోమకొండలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

దోమకొండ/సదాశివనగర్/పిట్లం, ఏప్రిల్ 10: ఆరు గ్యారెంటీల పేరుతో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయడంలో విఫలమైందని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి విమర్శించారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా దోమకొండ, సదాశివనగర్, పిట్లంలో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పోచారం మాట్లాడారు. నిరుద్యోగులకు రూ.4 వేలు అందిస్తామన్న మంత్రి భట్టి మాటలు ఎటుపాయె?, ఇక నుంచైనా 'భట్టి' మాటలు కట్టిపెట్టాలని హితవు పలికారు. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నదని, కానీ మహిళలు కనిపిస్తే బస్సులు ఆపి ఎక్కించుకోవడం లేదని ఆరోపించారు. పదేండ్లు ఎంపీగా ఉండి పది పైసల పని చేయలేని వ్యక్తి బీబీ పాటిల్ అని.. అలాంటి పనికి రాని మొక్కలను తీసి గోదావరిలో పడేయాలని సూచించారు. మోదీ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని విమర్శించారు. అంబానీ, అదానీ వంటి ధనికుల జేబులు నింపి పేదలను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గాలికి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు కొట్టుకుపోవాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్‌లో గులాబీ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్ సైనికులు కష్టపడి పనిచేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణలో అభివృద్ధి జరిగిందని, రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా నిలబెట్టిన నేత కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ కొనియాడారు. సమావేశంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, హనుమంత్ షిండే, జహీరాబాద్